# ముందే మేలుకో



ఆకాశం భోరున విలపిస్తున్నట్లుగా ఒకటే ఉరుములు. అంతులేని కన్నీటి ప్రవాహంలా జోరున వర్షం. హృదయాన్ని ముక్కలుగా కోస్తున్నట్లు మెరుపులు. సానుభూతి లేని రాక్షసిలా హోరున గాలి వీస్తూ ప్రకృతిని బీభత్సం చేస్తున్నది.

ఆ వర్షంలో చెట్టు మొదలుకు అనుకుని బిగుసుకు కూర్చున్న రాజు పూర్తిగా తడిసిపోయి చలికి గజగజ వణుకుతున్నాడు. గుండె బిగుసుకు పోతున్నట్లుగా ఉంది. చెట్టు కింద పల్లంలో నీరు ప్రవాహంలా వచ్చి నిలిచింది.

గాలి విసురుకు కొమ్మలు అరచి గీపెడుతూ విరిగి పడటానికి సిద్ధంగా వున్నాయి. ఇంకాసేపు అక్కడే ఉంటే చావటం తప్పదనిపించింది రాజుకు.

కళ్ళు చెదిరేలా ఒక్క మెరుపు మెరిసింది. ఆ వెలుగులో ఇండ్ల వరసలు తళుక్కున మెరిశాయి. ఎవరి పంచలోనైనా తెల్లవారే వరకు తల దాచుకుందామన్న ఆలోచన రాజు మనస్సులో మెదిలింది.

అంతలోనే భయంవేసింది. తనను చూస్తేనే అంతా అసహ్యించుకుంటారు. దూరంగా తొలగిపోతారు. అలాంటి తనకు ఆశ్రయం ఎవరిస్తారు? తన ఉనికే సమాజానికి ప్రమాదంగా భావించేటప్పుడు చస్తే మాత్రం ఎందుకు బాధ పడతారు? ఏ దురదృష్ట క్షణాల్లోనో తనలో ప్రవేశించి ఆశ్రయం ఏర్పరచుకున్న ఒక పురుగే తనను ఈ దుస్థితికి తెచ్చి నిరాశ్రయుడ్ని చేసింది.

ఇందులో తన నేరం ఏమిటి?

అతని ప్రశ్నకు సమాధానంగా ఆకాశం పిడుగుపాటుతో ముక్కలయి నట్లయింది. ఆలోచనలు తెగి ఉలిక్కిపడ్డాడు రాజు. అప్పటికే అతని చుట్టూ నీరు మడుగులాగా తయారయింది.

ఎవరో రమ్మని పిలిచినట్లుగా లేచి నిలబడ్డాడు రాజు. అంతా తలుపులు బిగించి లోపల వెచ్చగా పడుకున్నారు గనుక తెల్లవారే వరకు తనను ఎవరూ చూడరన్న ధైర్యంతో, జోలెను సంకకు తగిలించుకుని ఎదురింటికేసి వడిగా నడిచాడు.

పంచలో చాలా భాగం వర్షపు జల్లుకు తడిసింది. వర్షంలో బయట తడవటం కన్నా కాస్త మెరుగనుకున్నాడు. జోలె పక్కన పడేసి ఒక మూల ఒదిగి కూర్చున్నాడు. జోలెనుండి తడిపొడిగా ఉన్న ఒక పలచటి గోనె ముక్క తీసుకుని చుట్టుకున్నాడు.

కాసేపటికి శరీరం కాస్త వెచ్చబడి వణుకు తగ్గింది. పోతున్న ప్రాణం లేచి వచ్చినట్లనిపించింది. గుడ్లప్పగించి వర్షాన్ని చూస్తూ కూర్చున్నాడు. మెరుపు వెలుగులో అప్పుడప్పుడు వర్షాన్ని స్పష్టంగా చూడగలుగుతున్నాడు. ఇంటి ఆవరణంతా నీటితో నిండి మెల్లగా బయటకు పారుతున్నది.

చిన్నతనంలో వర్షం అంటే యెంతో సరదా! మేఘాలు నల్లగా కమ్ముకొస్తుంటే మనస్సు ఆనందంతో గంతులు వేసేది. అమ్మ తిడుతున్నా లెక్క చెయ్యకుండా

తమ్ముళ్ళు, చెల్లాయిలతో వర్షంలో తడుస్తూ ఆడుకునేవాడు. కాగితాలతో చిన్న చిన్న కత్తి పడవలు చేసి నీళ్ళలో వదిలి, అవి రయ్యిన దూసుకెళుతుంటే సంబరంగా చిందులు వేసేవాడు. పడవ కాగితాల కోసం కొత్త పుస్తకాలు చించినందుకు నాన్నతో దెబ్బలుతిన్నా బాధనిపించేది కాదు.

ఆ రోజుల్లో ఎంత ఆనందం? ఇప్పుడు మేఘాలు కమ్ముకొస్తుంటే శత్రువులు తరుముకొస్తున్నట్లుగా భయం. అప్పుడు వర్షంలో తడుస్తుంటే జబ్బు చేస్తుందన్న భయంతో మందలించటానికి తల్లిదండ్రులున్నారు. కాని ఇప్పుడు చావటానికి సిద్ధపడినా కనీసం జాలి చూపించే వాళ్ళే లేరు.

పుట్టుకతోనే తను అనాథ కాదు. అందరూ ఉన్నారు. నేడు తనవారంటూ చెప్పుకోవటానికి ఒక్కరూ మిగలలేదు. వాళ్ళ దృష్టిలో తను ఏనాడో చచ్చిపోయాడు.

రాజుకు గతం గుర్తొస్తున్న కొలది హృదయం బాధతో బరువెక్కసాగింది. వాతావరణంలా అతని మానసిక పరిస్థితి అల్లకల్లోలమైంది.

తన జీవితం మొగ్గదశలో ఉన్నప్పుడే వాడి ఎండిపోయింది. స్కూలుకు వెళుతున్న రోజుల్లోనే కాలి మీద ఎర్రటి మచ్చ చిన్నదిగా ఏర్పడింది. దాని గురించి ప్రత్యేకంగా ఆలోచించ గలిగే వయస్సుకాదు. అందుకే పట్టించుకోలేదు.

కాల క్రమేణా ఆ మచ్చ పెద్దదవసాగింది.

“అమ్మా చూడవే! నా కాలి మీద ఏదో మచ్చ” ఒకరోజు అమ్మకు చూపించాడు. మరి కొంత కాలానికి ఆ మచ్చ ఇంకా పెరిగింది. దాని మీద చేత్తో తడిమితే స్పర్శలేకుండా మొద్దుగా అనిపించేది. గిచ్చినా నొప్పి తెలిసేది కాదు. తనకు వింతగా ఉండేదప్పుడు. ఎంత గిచ్చినా ఏడవనని స్నేహితులతో పందెంకాస్తే బలంగా గిచ్చేవాళ్ళు. చీమ కుట్టినట్లయినా అనిపించేది కాదు. అది ఎంత ప్రమాదమో తెలుసుకోలేని తాను సంబరపడేవాడు. వాళ్ళెంత గిచ్చినా ఏడవకుండా తినే వస్తువులు గెలుచుకునేవాడు.

ఒకరోజు గొప్పగా అమ్మతో ఆ సంగతే చెప్పాడు తను. ఈసారి అమ్మ తేలిగ్గా తీసుకోలేదు. నాన్నతో చెప్పింది.

“ఆహారంలో ఏవో విటమిన్ల లోపం వలన పిల్లలకు అలా వస్తుంటాయిలే. అదే తగ్గిపోతుంది” నాన్న కొన్నాళ్ళు నిర్లక్ష్యం చేశాడు.

ఆ మచ్చకు తోడు మరోటి ఏర్పడటంతో, అమ్మ నాన్నను డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళమని పోరు పెట్టడంతో, నాన్న తీసుకువెళ్ళక తప్పింది కాదు.

డాక్టర్ తన మచ్చను పరీక్ష చేశాడు. నాన్నను ఏవో ప్రశ్నలు వేసి కోపగించటం మాత్రమే తనకు తెలిసింది. నాన్న దోషిలా తలవంచుకున్నాడు. మందులు రాసిచ్చి జాగ్రత్తగా వాడమని పంపాడు.

నాన్న ముఖంలో ఏదో దిగులు కనిపించింది.

ఆ రోజు రాత్రి మందు వేసుకొని పడుకున్నాడు. రోజులా త్వరగా నిద్రపట్టలేదు. నాన్న తన మచ్చ గురించి అమ్మకు ఏదో చెబుతుండటం అస్పష్టంగా వినిపించింది. కాసేపటికి అమ్మ ఎక్కిళ్ళు పెడ్తూ ఏడ్వటం తనకు భయం కలిగించింది.

ఆ మర్నాటి నుండే ఇంట్లో తన స్థానం మారింది. ఒక చాప మీద తనను వేరుగా పడుకోబెట్టారు. అందరం కలిసే పడుకొంటామని తమ్ముళ్ళు అల్లరి చేస్తే నాన్న తిట్టిపోశాడు. ఎవరూ కిక్కురుమనలేదు.

నాన్న వెనుకటిలా ప్రేమతో తనను చేరదియ్యటం లేదు. అమ్మ తనను చూసి కన్నీరు పెట్టటం తనకు అర్థం కాలేదు. అమ్మనలా చూసినప్పుడల్లా ఏదో తెలియని భయం తనను ఆవహించేది.

ఒక రోజు నాన్న ఆఫీసు నుండి వచ్చే సమయానికి చెల్లెలు వసంత, తను మంచంలో పడుకొని కబుర్లు చెప్పుకోవటం చూసి కోపంతో మండిపడ్డాడు. చెల్లిని పక్కమీద నుండి జుట్టుపట్టి ఈడ్చాడు.

"ఏవే! వాడి నంటుకోవద్దని నీకెన్నిసార్లు చెప్పినా లెక్కలేదా?" అంటూ శివమెత్తిన వాడిలా చావబాదేడు. అప్పుడు నాన్నంటే అసహ్యం వేసింది.

తమ్ముళ్ళను, చెల్లాయిలను తనకెందుకు దూరంగా వుంచుతున్నారో అర్థమయ్యేది కాదు. ఆడుకుందామని పిలిస్తే భయంతో పారిపొయ్యేవాళ్ళు. మాట్లాడిస్తే బెదిరిపొయ్యేవాళ్ళు. అందుకు కారణం తెలియక ఒంటరిగా ఏడ్చేవాడు.

ఇంట్లో తనను అందరూ పురుగులా చూడటం సహించలేక, ఎక్కువ కాలం బయటనే పిల్లలతో ఆడుకొంటూ గడిపేవాడు. అంతకు ముందు ఇంట్లో వుండకుండా బయటకు వెళితే తిట్టిపోసే అమ్మ, ఇప్పుడు ఎంతసేపు తిరిగొచ్చినా పల్లెత్తు మాటనేది కాదు. అది ఒక్కటే తనకు కాస్త ఆనందం కలిగించిన విషయం.

ఒకసారి వూర్లోకి చిన్న పిల్లల సినిమా ఒకటి వచ్చింది. చూచిన పిల్లలంతా దాని గురించి ఎంతో గొప్పగా చెప్పడం విని తనకూ చూడాలనిపించి భయపడ్తూనే నాన్నను అడిగాడు.

సినిమా పేరెత్తితేనే మండిపడే నాన్న ఆ రోజు ఏమీ అనలేదు. వెంటనే రెండు రూపాయలు తీసి చేతిలో పెట్టాడు.

"రేయ్! సినిమాకు వెళ్తున్నట్లు ఇంకెవరికీ చెప్పక. వాళ్లూ ఏడుస్తారు. ఈసారి నువ్వు ఒక్కడివే వెళ్ళిరా" రహస్యంగా అన్నాడు నాన్న.

అంత తేలిగ్గా నాన్న తనను అనుమతించటంతో ఏనుగు ఎక్కినంత సంబరమై, గుప్‌చిప్‌గా సినిమాకి వెళ్ళిపోయాడు. టిక్కెట్టుకు పోగా మిగిలిన డబ్బుతో కావల్సినవన్నీ కొనుక్కుతిన్నాడు.

సినిమా ఎంతో నచ్చింది. అందులోని సంఘటనలను నెమరువేసుకుంటూ ఉరుకుల పరుగుల మీద ఇంటికొచ్చి చూసేసరికి గుండె గుభేలుమంది. తాళం వేసి వుంది.

తనకు చెప్పకుండా అంతా ఎక్కడికి వెళ్ళారో అర్థం కాలేదు. వాళ్లకోసం ఎదురుచూస్తూ పంచలోనే కూర్చున్నాడు. ఎంత రాత్రి గడిచినా రాలేదు. భయం వేసింది. ఏడుపొచ్చింది. ఆకలి వేసింది. ఆ పంచలోనే నేలమీద పడి నిద్రపోయాడు తను.

తెల్లవారింది. ఇంకా నిద్రలేవని తనను ఎవరో తట్టి లేపారు.

"ఏయ్! అబ్బాయ్! ఇక్కడ పడుకున్నావేం? లే..... లే" ఎవరిదో కంఠం విని ఉలిక్కిపడి లేచి చూశాడు తను.

ఎవరో తనకు తెలియని కొత్త ముఖాలు. రిక్షా మీద వేసిన సామాను దించి పంచలో పెడ్తున్నారు. అంతా అయోమయంగా ఉంది. తమ ఇంటికి వీళ్ళెందుకు వచ్చారు?

"ఈ ఇంట్లోవాళ్ళు ఎక్కడికి వెళ్లారు?" భయంగా అడిగాడు.

"వాళ్ళు నిన్ననే ఖాళీచేసి వూరు వెళ్లిపోయారు. మేం క్రొత్తగా అద్దెకొచ్చాం. వెళ్ళు" అన్నాడు అతను.

ఆ మాట వినగానే తనకు ఒక్కసారిగా దుఃఖం ముంచుకొచ్చింది. కాళ్ళీడ్చుకుంటూ బయటకు నడిచాడు. ఎక్కడన్నా కనిపిస్తారేమోనని వెదుకుతూ వూరంతా తిరిగాడు తను.

తనను దిక్కులేని వాడిగాచేసి అంతా ఎక్కడికి వెళ్ళారో తెలీలేదు. తలచుకొనే కొలది గుండె పగులుతుంది. కోపంతో కసి రగులుతుంది. ఆకలితో ఆ రోజంతా

తిరిగి తిరిగి ఒకచోట సొమ్మసిల్లి పడిపోతే ఎవరో కనికరించి అన్నం పెట్టారు. ఖాళీగా కనిపించిన ఒక అరుగు మీద పడి నిద్రపోయాడు తను.

ఆనాటి నుండి తన జీవితం మారిపోయింది. దిక్కులేని వాడయ్యాడు. తనలాంటి అనాథల స్నేహంతో అడుక్కుతినే వాడయ్యాడు. అమ్మా, నాన్న ఉండి తనను దిక్కులేని వాడిగా ఎందుకు వదిలేశారో తనకు అర్థం కావడానికి మరి కొన్నేళ్ళు పట్టింది.

పిచ్చివాడిలా తిరగసాగాడు.

నెలలు గడిచే కొలది తన శరీరంలో మార్పులు వచ్చాయి. ఒంటినిండా మచ్చలు పెరిగి అల్లుకుపోయాయి. కనుబొమ్మలు, కనుపాపలు రాలిపోయి ముఖం వికృతంగా అయిపోయింది. చేతి వేళ్ళు వంకర తిరిగిపోయాయి.

తన తోటివాళ్ళు అసహ్యించుకుంటూ దూరంగా తొలగిపోవటం మొదలెట్టారు. వాళ్ళ ద్వారానే తెలుసుకోగలిగాడు, తనకు కుష్ఠువ్యాధని. ఆ వ్యాధి ముదిరి వున్నవాళ్ళని చూస్తూ పోల్చుకొని కుమిలికుమిలి ఏడ్చాడు తను.

కొన్నాళ్ళకు తనూ వాళ్ళలో ఒకడయ్యాడు. జట్టుగా కలిసి అడుక్కుంటూ, వచ్చింది పంచుకు తినటానికి అలవాటు పడిపోయాడు. అప్పుడప్పుడు వాళ్ళు ప్రభుత్వ ఆసుపత్రికి మందుల కోసం వెళ్తుంటే తనూ వెళ్ళి డాక్టర్‌తో తన దీనస్థితి చెప్పి కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

“రాజూ! చిన్నతనంలో వ్యాధి నీకు మచ్చరూపంలో ప్రారంభమైనప్పుడే తగిన వైద్యం జరిగి వుంటే ఈనాడిలా అయ్యేవాడివి కాదు. వ్యాధంటే సరయిన అవగాహనలేని నీ తల్లిదండ్రులు, ఇది తగ్గదని, ఇంట్లో అందరికీ వస్తుందన్న భయంతో నిన్ను అనాథను చేశారు. మూర్ఖత్వంతో నీ జీవితాన్ని చేజేతులా నాశనం చేశారు. ఇక నుండయినా నువ్వు జాగ్రత్తగా మందు తింటే వ్యాధి ఉధృతం తగ్గి కొన్నాళ్ళకు పూర్తిగా నయమవుతుంది” ధైర్యం చెప్పి మందులిచ్చారు.

కొన్నేళ్ళ చికిత్స తరువాత తనలో వ్యాధి లక్షణాలు పూర్తిగా తగ్గిపోయాయన్నారు. అయితే అంతకుముందు ఉన్న అంగవైకల్యం అలానే నిలిచి పోయింది. ఇప్పుడు తనలో ఆ వ్యాధిలేకున్నా తన మీద కుష్ఠువాడిగా చెరగని ముద్ర పడిపోయింది.

ఈనాడు తనతోపాటు బజార్లలో అడుక్కుంటున్న వాళ్ళంతా ఏదో కారణంగా ప్రారంభంలో చికిత్సను అలక్ష్యం చేసి ఇలా తయారయిన వాళ్ళే. ఏ విధమయిన

ఆదరణకి నోచుకొనక బ్రతుకు మీద విరక్తిని పెంచుకున్నవాళ్ళే. తమ దుస్థితికి కారణం తమ నిర్లక్ష్యమేనని పశ్చాత్తాపంతో ఏడ్చేవాళ్ళే.

చేతులు కాలినాక ఆకులు పట్టుకొని ఏం లాభం? అందరి జీవితాల్లోనూ అదే జరిగింది.

సంఘం దృష్టిలో తాము చీడ పురుగులు. అందుకు కారణం, తాము హంతకులూ కాదు, దొంగలూ కాదు. కేవలం చర్మసంబంధమైన వ్యాధి తమనీస్థితికి దిగజార్చిందన్న సానుభూతి, జాలి ఎందరికుంది? కుమిలి ఏడుస్తున్నాడు రాజు.

భయంకరమైన ఆ చీకటి రాత్రిలో రాజు ఆవేదన ఎవరికి తెలుస్తుంది? అలా ఏడుస్తూనే రాజు గోడకు చేరగిలబడి నిద్రపోయాడు.

తెల్లవారింది. ఎవరో తనను కర్రతో తడుతూ లేపటంతో ఉలిక్కిపడి లేచాడు.

"ఏయ్! ఇక్కడ పడుకున్నావేం? వెళ్ళు వెళ్ళు" ఎదురుగా నిలబడి కసురుకొంటున్న యువతిని చూడగానే రాజు కనుబొమ్మలు ఆలోచనతో ముడిపడ్డాయి.

ఎప్పుడో, ఎక్కడో చూసినట్లుగా అనిపించి ఆశ్చర్యంగా చూస్తున్నాడు. అట్టడుగున మనస్సులో ఇంకిపోతున్న జ్ఞాపకాలు తిరిగి మేల్కొన్నాయి.

"అమ్మా! వసంతా!" ఒక్కసారిగా అరిచాడు ఆనందంగా.

ఆ పిలుపుకు ఆ అమ్మాయి తుళ్ళిపడింది. ఆశ్చర్యంతో నోరెళ్ళబెట్టింది. అతనికేసి వెర్రిగా చూసింది.

"నేనమ్మా! నీ అన్నయ్యను - రాజును" అన్నాడు లేస్తూ.

అంతే! ఆ అమ్మాయి భయంగా అరుస్తూ ఒక్కసారిగా లోపలకు పరుగెత్తింది. క్షణాల్లో తల్లిని వెంట బెట్టుకొచ్చింది.

రాజు గుర్తుపట్టాడు. కాని ఆమె వికృతంగా మారిపోయిన రాజు ముఖంలో అతని బాల్యపు పోలికల్ని వెదుక్కుంటోంది.

"అమ్మా! నన్ను గుర్తుపట్టలేదా? రాజునమ్మా! ఎన్నో ఏండ్లక్రితం మీరు వదిలేసిన రాజును". రాజు కంఠం దుఃఖంతో పూడుకుపోయింది.

ఆవిడ ముఖాన్ని చేతులతో కప్పుకుని బావురుమని ఏడ్చింది.

"రాజూ! చివరకు నిన్నీస్థితిలో చూడవలసి వచ్చిందా, నాయనా!" ఆమె గుండె పగిలిపోతున్నట్లుంది.

అంతలో లోపల్నుండి రాజు తండ్రి సుందరయ్య బయటికొచ్చి రాజును చూశాడు. ఉలిక్కిపడ్డాడు. ఆయన హృదయంలో ఎక్కడో కలుక్కుమంది.

"సరస్వతీ! ఏడవక! ముందు నువ్వు లోపలికెళ్ళు" కసిరాడు సుందరయ్య.

లోపల్నుండి మూడో అమ్మాయి కల్పన, చిన్నవాడు కిశోర్ వచ్చి బిక్కముఖా లేసుకు చూస్తున్నారు. రాజు చూపులు ప్రేమతో వాళ్ళను తడుముతున్నాయి.

ఆ సమయంలో మాట్లాడటానికి ఎవరికీ నోరు పెగలటం లేదు.

"నాన్నా! అంతా బాగున్నారుగా!." తానే పలకరించాడు రాజు.

సుందరయ్యకు గొంతు పెగల్లేదు.

"రాత్రి మీ అనుమతి లేకుండా ఇక్కడ తలదాచుకున్నాను. క్షమించండి. ఎన్నో ఏళ్ళక్రితం మీరు కావాలని వదులుకున్న కొడుకును నేనేనని గుర్తుకు తేవాలని రాలేదు. అనుకోకుండా కలిశాం. అలానే విడిపోదాం. భయపడకండి" రాజు కళ్ళు వర్షిస్తున్నాయి.

"రాజూ! ఆనాడలా ఎందుకు చేశానో అర్థంచేసుకో. నీ తమ్ముళ్ళు, చెల్లాయిల భవిష్యత్తు కోసమే నిన్ను బలిపెట్టాను. ఈ వ్యాధి మన కుటుంబంలో ఒకరికి ఉందని తెలిస్తే ఎలా చూస్తారో నీకు తెలిసే వుంటుంది. అది ఆలోచించే నిన్ను దూరం చేసుకున్నాను" ఆయన కళ్ళల్లో నీరు సుడులు తిరిగింది.

రాజు పేలవంగా నవ్వేడు.

"నాన్నా! అందుకు సంజాయిషీ నేను అడగటం లేదు. కాని ఆనాడు ధైర్యంతో నన్ను భరించగలిగి వుంటే నా బతుకు ఇలా బజారు పాలయ్యేదికాదు. ఆ తప్పును సరిదిద్దుకునే అవకాశం మీకు లేదు. అందుకు శిక్షను నేననుభవిస్తున్నాను. అది తెలిసీ మిమ్మల్ని అసహ్యించు కోవటం లేదు. నా దురదృష్టంగా ఏడుస్తున్నానంతే" పొంగుకొచ్చే దుఃఖాన్ని నిగ్రహించుకున్నాడు.

"నాయనా రాజు! నిన్ను అమాయకంగా వదులుకున్ననాడే ఈ పాపిష్ఠి తల్లి చచ్చిపోయిందిరా. ఏ కన్నవాళ్ళు విధించని శిక్ష నీకు విధించాం" బావురుమంది సరస్వతమ్మ.

"అమ్మా! ఎప్పటికైనా ఒక్కసారి మిమ్మల్నందర్నీ చూడాలనుకున్నాను. ఆ కోరిక తీరింది. ఇక మళ్ళీ మీ కెప్పుడూ కనిపించను". రాజు కళ్ళల్లో నీళ్ళు పొంగాయి.

అప్పుడే నిద్రలేచి కళ్ళు నులుముకుంటూ బయటికొచ్చిన సురేష్ రాజుకేసి అయోమయంగా చూడసాగాడు.

రాజు తమ్ముళ్ళకేసి, చెల్లాయిలకేసి తృప్తిగా చూశాడు.

"మీ అందరికీ లీలగా గుర్తుండే ఉంటాను. మీకు ఒక అన్నయ్య ఉన్నాడనే సంగతి మీరు మర్చిపోకండి... వస్తాను" అందర్నీ ఉద్దేశించి అని, అడుగు ముందుకేశాడు.

"రాజు! ఒక నిమిషం ఆగు" సుందరయ్య లోపలికెళ్ళాడు.

"అన్నయ్యా! వెళ్ళిపోతున్నావా?" వసంత ఏడ్చింది.

"తప్పదమ్మా! నా నీడ మీ మీద పడటం మీ భవిష్యత్తుకు మంచిది కాదు. వెళుతూ మీ అందర్నీ ఒక్కటే కోరుతున్నాను. నాలాంటి నిర్భాగ్యులు మీకు తారసపడినప్పుడు అసహ్యించుకోకుండా సానుభూతి చూపండి. అదే మా జీవితాలకు ఊరడింపు" రాజు కళ్ళు తుడుచుకున్నాడు.

"రాజూ! ఇవి తీసుకోరా!" సుందరయ్య పది రూపాయల నోట్లు అందించబోయాడు. రాజు దెబ్బతిన్నట్లుగా చూశాడు.

"నాన్నా! లోకందృష్టిలో నేను ముష్టివాడ్నే. కాని, మీరూ అదే దృష్టితో చూస్తున్నారా? మీ బిడ్డగా ఆదరించారన్న అమృత క్షణాల్ని నాకు జ్ఞాపకాలుగా మిగలనివ్వండి. వస్తాను" వస్తున్న దుఃఖాన్ని అణుచుకుంటూ రోడ్డెక్కాడు రాజు.

"అన్నయ్యా!" వసంత హృదయంలోని పిలుపు వెలుపలకు రాకుండానే ఇంకిపోయింది.

◆ ◆ ◆

ఆ రోజు ఆదివారం. రాజు చెట్టునీడలో కూర్చుని కాస్త దూరంగా ఆడుకుంటున్న చిన్న పిల్లల్ని గమనిస్తున్నాడు. సంతోషాన్ని అనుభవించటానికే పుట్టినట్లుగా ఆనందంతో కేరింతలు కొడుతున్న పిల్లల్ని చూస్తూ తన బాధను మరచిపోగలుగుతున్నాడు.

ఎంతో సేపట్నుండి అలా చూస్తున్న రాజు ఒక పిల్లవాడ్ని చూసి ఉలిక్కిపడ్డాడు. ఆ పిల్లవాడి చేతి మీద ఎండలో మెరుస్తూ కనిపిస్తోంది ఎర్రటి మచ్చ.

చిన్న తనంలో తనకూ అలాంటి మచ్చే వుండేది. భవిష్యత్తులో అది తనస్థితికి తీసుకువెళ్ళుతుందో తెలీని అమాయకత్వంతో అలానే ఆడుకునేవాడు. తన పరిస్థితి ఆ బాబుకు రాకూడదు. ఎలాగైనా ఆ చిన్నారి జీవితాన్ని రక్షించాలి.

లేచి నిలబడ్డాడు రాజు. ఆడుకుంటున్న ఆ కుర్రవాడి దగ్గరగా వెళ్ళి పరీక్షగా చూశాడు. సందేహం లేదు. అలాంటి మచ్చే.

"బాబూ! నీ పేరేమిటి?" మెల్లగా అడిగాడు రాజు.

ఆ పిల్లవాడు రాజును చూసి జడుసుకున్నాడు.

"మీ ఇల్లెక్కడో చెబుతావా?" తిరిగి అడిగాడు రాజు.

ఈసారి ఆ పిల్లవాడు మరీ బెదిరిపోయి పరుగు లంకించుకున్నాడు. వెంటనే రాజు ఆ పిల్లవాడిమీద దృష్టి నిలిపి వేగంగా అనుసరించాడు. రెండు సందులు తిరిగి ఒక ఇంట్లో చొరబడ్డాడు. రాజు ఆ ఇంటి ముందే కొద్ది క్షణాలు తచ్చట్లాడి 'జనార్ధన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్' అని రాసి ఉన్న నేమ్‌ప్లేట్ చదువుకుని లోపలకు అడుగుపెట్టాడు.

"అమ్మా! అడుగోనే బూచాడు. నన్ను పట్టుకోబోయాడు" తల్లి చాటుగా నక్కి రాజును చూపెట్టాడు.

రాజును చూడగానే ఆమెకు ముచ్చెమటలు పోశాయి. భయంతో వెన్నులో చలిపుట్టినట్లయింది.

"ఏమండీ! ఒకసారిలా బయటకు రండి" భర్తను కేకేసింది కంగారుగా.

"ఏమిటి, మీనాక్షీ!" అంటూనే బయట కొచ్చి రాజును చూసి ముఖం చిట్లించాడు.

"నమస్కారం! మీకో విషయం చెప్పాలని వచ్చాను" నమస్కరించాడు రాజు.

"ఏమిటి?" నిర్లక్ష్యంగా అడిగాడు జనార్ధన్.

"మీ బాబు చేతి మీద మచ్చ ఉంది. చూశారా?" సంశయంగా అన్నాడు రాజు.

"ఏం? నువ్వేమన్నా డాక్టరువా?"

"కాదు కాని, అనుభవిస్తున్న రోగిని" రాజు సమాధానానికి ఉలిక్కిపడ్డాడతను.

"నీ సలహాలు మా కనవసరం" కోపంగా అంది మీనాక్షి.

"నేను స్వార్థంతో మీ ఇంటికి రాలేదు. ఒక చిన్నారి జీవితం కాపాడాలనే వచ్చాను. నా వ్యాధి ఏమిటో మీకు తెలుసు. ప్రారంభంలో ఈ వ్యాధి అలా మచ్చరూపంలోనే ఉంటుంది" చెప్పాడు రాజు.

"యూ స్టుపిడ్! మా బాబుకు నీ లాంటి వ్యాధి అంటావా? పిచ్చిగా వాగక బయటకు నడువ్" అరిచాడు జనార్ధన్.

"సార్! మీరెన్ని తిట్టినా బాధపడను. నా తల్లిదండ్రుల నిర్లక్ష్యం వల్లనే నేనిలా అయ్యాను. నామాట విని ఒక్కసారి బాబును డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళండి. వారే

చెబుతారు. మీ బాబు జీవితాన్ని నాశనం చెయ్యకండి". గబగబా బయటకు నడిచాడు రాజు.

రాజు బయటకు వెళ్ళగానే మీనాక్షి బాబును హృదయానికి హత్తుకుని బావురుమంది. ఆ క్షణాల్లో జనార్ధన్ పరిస్థితి కూడా అలానే ఉంది.

★ ★ ★

రెండు సంవత్సరాలు గడిచిపోయాయి. ఆ కాలంలో రాజు ఎన్నో వూళ్ళు తిరిగాడు. ఒకరోజు వీధిలో అడుక్కుంటూ వెళ్ళుతున్న రాజు 'జనార్ధన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్' నేమ్ ప్లేటు చూసి ఏదో గుర్తొచ్చినట్లుగా ఆగిపోయాడు.

వరండాలో చెల్లాయితో ఆడుకుంటున్న జనార్ధన్ కొడుకును చూసి గుర్తించాడు. ఆనాటి సంఘటన కళ్ళముందు మెదలగానే ఆ ఇంటిగేటు నెట్టుకొని లోపలకు అడుగు పెట్టాడు.

"బాబూ! నాన్నగారున్నారా?" రాజు ప్రశ్నకు ఆ కుర్రవాడు భయపడ్డట్టుగా చూసి లోపలకు పరిగెత్తాడు.

"అడుగో బూచాడు!" అంటూ తండ్రిని వెంటబెట్టుకుని రావడం చూసి రాజుకి నవ్వొచ్చింది.

"నమస్కారం, సార్! ఈ బూచోడు గుర్తొచ్చాడా?" చేతులు జోడించాడు రాజు. మీనాక్షి కూడా బయటికొచ్చి రాజును గుర్తించింది.

రాజును గుర్తించి నవ్వేడు జనార్ధన్.

'సార్! బాబుకెలా ఉంది?" రాజు.

"రాజూ! నీకు మేమెంతో ఋణపడి ఉన్నాం. బాబు విషయంలో నువ్వు చెప్పిందే నిజమైంది. ఇంకొన్నాళ్ళు మేం అలక్ష్యం చేసి ఉంటే ఇంకా తీవ్రమై ఉండేది. బాబుకు నీవెంతో మేలు చేశావు" కృతజ్ఞతగా అన్నాడు జనార్ధన్.

"రాజూ! ఆనాడు బాబుపాలిట దేవుడిలా వచ్చావు. ఇప్పుడు పూర్తిగా తగ్గిపోయింది. చూడు" కొడుకు చేతిని అందుకుని చూపింది మీనాక్షి.

తృప్తిగా చూశాడు రాజు. చేతిమీద మచ్చ ఏ మాత్రం లేకుండా పూర్తిగా మాసిపోయింది.

"కూర్చో, రాజు!" దంపతులిద్దరూ ఒక్కసారే అన్నారు.

"ఫరవాలేదండి! నాకిప్పుడెంతో సంతోషంగా ఉంది. ఒక జీవితాన్ని నాలా కాకుండా రక్షించ గలిగాను. మీ బాబు వయస్సులోనే నాకు వ్యాధి వచ్చింది. కాని,

నా తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేశారు. చివరకు డాక్టర్‌కు చూపించి కుష్ఠువ్యాధని తెలుసుకుని, భయంతో నన్ను నిర్దాక్షిణ్యంగా వదిలేశారు. అందుకే నా జీవితమిలా అయింది. లేకుంటే నేనూ అందరిలా ఆనందంగా బతకాల్సిన వాడినే. ముందే మేలుకుని మీరెంతో బాధ్యతతో మీ బాబు జీవితాన్ని కాపాడారు. నాకదే తృప్తి. వస్తాను". కన్నీళ్లు తుడుచుకుంటూ బయటకు వెళ్ళబోయాడు రాజు.

"రాజూ! ఒక్కక్షణం ఆగు" మీనాక్షి లోపలకు వెళ్ళింది.

"వెళుదువుగాని కూర్చో, రాజూ!" అభిమానంగా అన్నాడు జనార్దన్.

సమాధానంగా నవ్వేడు రాజు.

మీనాక్షి లోపల్నుండి బట్టలు తీసుకు వచ్చింది. రాజు ఆశ్చర్యంగా చూశాడు.

"రాజూ! నీ సహాయానికి ప్రతిఫలంగా వెల కడుతున్నామనుకోవద్దు. మా తృప్తి కోసం కాదనకు" అభ్యర్థనగా అంది మీనాక్షి.

"రాజూ! నీ రుణం తీర్చుకోలేనిదయ్యా! ఈ మాత్రం సంతోషాన్ని మాకు దక్కనివ్వు" జనార్దన్ మీనాక్షి చేతిలోని కొత్త పంచెలు అందుకుని రాజు చేతిలో వుంచాడు.

వాళ్ళ అభిమానానికి రాజు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "సార్! ఇంతకాలంగా అవమానాల్ని భరిస్తూ ఎంత త్వరగా చచ్చిపోదామా అని ఎదురు చూస్తున్నాను. ఈనాడు మీరు చూపించే అభిమానం నన్ను ఇంకొంత కాలం బతకమంటోంది. వస్తానమ్మా!" తడబడుతున్న అడుగులతో బయటకు నడిచాడు రాజు.

*(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 10-6-1981)*